క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భువనేశ్వర్ కుమార్ బతుకు దెరువు కోసం వచ్చి లక్డారం శ్రీరామ్ స్టోన్ క్రషర్ వద్ద ప్రొక్లయినర్ హెల్పర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీన పని చేసేచోట డ్రైవర్ అమిత్ టాటా హిటాచీ డీజిల్ డ్రమ్ముల లోడు దించడానికి పెట్టి మూత్ర విసర్జనకు వెళ్లాడు. అదే వాహనంపై హెల్పర్‌గా పనిచేస్తున్న సునీల్ టాటా హిటాచీని ఆపరేట్ చేయగా వాహనం లోడర్ ఇనుప బకెట్ కింద ఉన్న భువనేశ్వర్ మోకాళ్లకు తాకుతూ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స కోసం ఇస్నాపూర్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని మరో ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పైపులైన్ పనుల పరిశీలన

మునిపల్లి(అందోల్): బుదేరా చౌరస్తా 65వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో వర్షం నీరు, మురుగునీరు వెళ్లేందుకు వీలుగా నూతనంగా చేపట్టిన పైపులైన్ పనులను ఎంపీడీఓ హరినందన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి



మొక్క నాటుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. పట్టణంలోని రాయసముద్రం చెరువును జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ సురేష్‌తో కలసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ పక్కన ఇష్టానుసారంగా చెత్త వేస్తున్నారన్నారు. దీంతో వాకింగ్‌కు వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం బాలవిహార్ పార్కు పరిసర ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో చెత్తను తొలగించి మొక్కలు నాటారు.

ఈద్గా పరిసరాల శుభ్రతకు చర్యలు

నారాయణఖేడ్: ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణ శివారులోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ మాజీద్, మాజీ ఎంపీటీసీ ముంతాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్‌అలీ, పురపాలిక పారిశుద్ధ్య పర్యవేక్షకులు శ్రీనివాస్ తదితరులు ఈద్గాను సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈద్గా పరిసరాలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించగా కార్మికులు దర్గా పరిసరాల పనులను ప్రారంభించారు.

కాలుష్యాన్ని అరికట్టండి

జిన్నారం(పటాన్‌చెరు): రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టాలని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రామాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాలుష్య నివారణకు ఈ నెల 16న ఖాజీపల్లిలో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు కోసం సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. సమావేశానికి యువకులు, సామాజిక వేత్తలు, పర్యావరణ వేత్తలు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాలుష్య సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు.

మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కుర్షిద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం తోషిబా సమీపంలో శంభో వెంచర్ ఖాళీ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

- విద్యారంగానికి పెద్దపీట వేయాలి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుప్రజ ఎంపీటీసీలు మంజుల, మాధవి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మండల విద్యాధికారి రాథోడ్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న రాములు, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో...

మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాసాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డితో కలిసి నగదు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం కృష్ణ బృందావన్ కాలనీలో నూతనంగా నిర్మించిన జలమండలి వాటర్ ట్యాంకును పరిశీలించారు. త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జలమండలి జీఎం నారాయణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందని కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశ్రీ అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురార్జీ, ఉపాధ్యాయులు రామకృష్ణ, ప్రవీన్‌కుమార్, రాములు, సీఆర్పీ నాగేష్ పాల్గొన్నారు.

ఝరాసంగం మండలంలో...

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బిడేకన్నె, పొట్టిపల్లి, కుప్పానగర్ తదితర పాఠశాలల్లో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుధాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

కొండాపూర్(సంగారెడ్డి): బడిబాట కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ భీంసింగ్ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్‌రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సదాశివపేట రూరల్: నిజాంపూర్ (కే) ప్రభుత్వ పాఠశాలలో..

సాయిపేట పాఠశాలలో...

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని సాయిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



రాయిపల్లి (డీ)తండాలోని ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో రాయిపల్లి(డీ) తండాలో హెచ్‌ఎం దేవిసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేయించి చిన్నారులతో అక్షర శ్రీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బస్వరాజ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు బదులు ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని సూచించారు. సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.



ఝరాసంగంలో..



కొండాపూర్‌లో ..



వట్‌పల్లిలో..

అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం

సమస్యల పరిష్కారం, నిధుల వినియోగంపై మున్సిపల్ సమావేశంలో చర్చ



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విషయమై కౌన్సిల్ సభ్యులు అధికారులతో చర్చించారు. ఒకటో వార్డులో విద్యుత్ స్తంభాలు లేకపోవటంతో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని సభ్యుడు చంద్రయ్య అన్నారు. అంబేడ్కర్ కాలనీని ఏ వార్డులో విలీనం చేస్తారని, నూతనంగా మంజూరైన కమ్యూనిటీ హాలును బీసీ కాలనీలో ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ గోపాలమ్మ కోరారు. బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో రోడ్లు సరిగాలేవని, నీటి సరఫరా సక్రమంగా లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో రూ.11కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసింది. అనంతరం రోజారాణి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా దశలవారీగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు. మేనేజర్ నిర్మల, ఆర్వో శ్రీధర్, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంగవైకల్య విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వాలి

- ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదు
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



మండల విద్యాధికారి బస్వరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ ఇవ్వడంలేదని ఎన్‌పీఆర్‌డీ నాయకులు ఎంఈఓ బస్వరాజ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. అనుమతి పొందిన ప్రైవేట్ విద్యాసంస్థల్లో అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తూ జీవో విడుదల చేసిందన్నారు. పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చి మిగతా విద్యార్థులతో సమానంగా విద్యాబోధన చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చట్టంలో ఉందని తెలిపారు. పట్టణంలోని మోంటసరీ పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వడంలేదని, ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుని గుర్తింపును వెంటనే రద్దు చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఎంఈఓ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో జహీరాబాద్ ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, మచ్చెందర్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా అడ్డుకోవాలి



ఎస్‌ఐ సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): బక్రీద్ సందర్భంగా గోవులను అక్రమ రవాణా చేసే అవకాశం ఉండటంతో వాటిని అడ్డుకోవాలని కోరుతూ బీజేవైఎం నాయకులు శుక్రవారం ఎస్‌ఐ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్ మాట్లాడుతూ గోసంరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యువమోర్చా నాయకులు శ్రీకాంత్, పాండు, ప్రశాంత్, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మునిపల్లి: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధాయులు లక్ష్మన్ పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శంకరయ్య, నాగయ్య, రాజయ్య, ఎల్లమ్మ, అంతజయ్య పాల్గొన్నారు.

జిన్నారం మండల పరిధిలో...

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాల కిట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జిన్నారంలో..

కల్హేర్ ప్రాథమిక పాఠశాలలో..

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరమ్మ, టీచర్ లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేకుండా చూడండి

ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: వానాకాలం సీజన్‌లో అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారన్నారు. అందుకు అనుగుణంగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భిక్షపతి, ఆయా మండలాల ఏఓలు ప్రవీణ, నవీన్‌కుమార్, వెంకటేశ్, లావణ్య, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బక్రీద్ పండగ ఏర్పాట్లపై సమీక్ష

జహీరాబాద్ టౌన్: బక్రీద్ పండగ సందర్భంగా పట్టణంలో మున్సిపల్ తరఫున చేయవలిసిన ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఈద్గా మైదానంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మాజీ కౌన్సిలర్లు తంజీమ్, అబ్దుల్లా, టీఆర్‌ఎస్ నాయకులు యాకూబ్, మోహియోద్దీన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు గృహజ్యోతి వర్తింపజేయండి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో అర్హులైన అందరికీ గృహజ్యోతి వర్తింపచేయాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు విద్యుత్ డీఈని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో 32 వేల గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు నెలకు రూ.కోటి 24లక్షలు మాఫీ అవుతుందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొంతమంది అర్హులు మిగిలిపోయారని, వారిని కూడా గుర్తించి అర్హులుగా చూడాలని విద్యుత్ డీఈని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి మతిన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా, శ్రీనివాస్ ముదిరాజ్, హనుమంతు, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఇటీవల ఆయా గ్రామాల నాయకులు ఉన్నతాధికారులకు విన్నవించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం జిన్నారం ఎంపీడీఓ అరుణ గడ్డపోతారంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టాయిపల్లి, అల్లీనగర్‌లను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కిష్టాయిపల్లి గ్రామస్తులు మాత్రం తమకు ప్రత్యేక పంచాయతీ వద్దని అధికారులకు విన్నవించారు. దీంతో ఎంపీడీఓ అరుణ గడ్డపోతారం, కిష్టాయిపల్లి, అల్లీనగర్ గ్రామాల ప్రజలతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల ప్రజల అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

16న శ్రీరామ శిలాయాత్ర

సంగారెడ్డి టౌన్: జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీరామ శిలా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు పీఠం సభ్యులు తోపాజి అనంతకృష్ణ, ప్రశాంత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శోభాయాత్ర మధ్యాహ్నం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి సంగమేశ్వర దేవాలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ బడిబాటపై సమీక్ష

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బడిబాటపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

◆ సబ్‌స్టేషన్లకు ఫోన్‌నంబర్ల ఏర్పాటు

మునిపల్లి(అందోల్): విద్యుత్ సబ్‌స్టేషన్లకు కొత్తగా ఫోన్ నంబర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని విద్యుత్ ఏఈ ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దలోడి సబ్ స్టేషన్‌కు 8985204434, తాటిపల్లి సబ్‌స్టేషన్‌కు 8985204978 నంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు పైన పేర్కొన్న ఫోన్‌నంబర్లను సంప్రదించాలని సూచించారు.

◆ విద్యార్థుల సంఖ్య పెంచాలి

పటాన్‌చెరు టౌన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు.

◆ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

జహీరాబాద్: తమ వ్యవసాయ పొలాలకు వెళ్లి భూములు సాగు చేసుకునేందుకు వీలుగా దారి చూపించాలని బాధితులు తహసీల్దార్‌ను కోరారు. కోహీర్ పట్టణానికి చెందిన పలువురు బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ భూముల పక్కన ఉన్న రైతు తన భూమిని రియల్టర్లకు విక్రయించడంతో వారు ఫెన్సింగ్ వేశారని, దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

◆ ఉచిత వైద్య శిబిరం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో శుక్రవారం ఏబజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీహరి, ఏబజీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కంగ్టి(నారాయణఖేడ్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని సిర్గాపూర్ డీసీసీ బ్యాంకు మేనేజర్ రవిందర్ రైతులకు సూచించారు. కంగ్టిలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చౌక్‌లో బ్యాంకు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన వివిధ పథకాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంతోష్ మెండే, వెంకట్‌రావు దేశాయి, మొగులప్ప పాల్గొన్నారు.

◆ తప్పిన ప్రమాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలోని ఓ గదిలోని స్లాబ్ పైపెచ్చు ఊడి కింద పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాలలోని రికార్డు అసిస్టెంట్ గదిలో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు గదిలోకి వెళ్లి చూడగా గదిలోని స్లాబ్ పైపెచ్చు పడి ఉంది. స్లాబ్ పైపెచ్చు కింద పడిన సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

◆ మిషన్ భగీరథ నల్లాలపై ఆన్‌లైన్ సర్వే

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని బాన్సువాడ, దామరగిద్ద గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ పథకంలో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన నల్లాల ఫోటోలు తీసి ఆన్‌లైన్ చేస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీలు తెలిపారు. ప్రతీ ఇంటిలో ఎన్ని నల్లాలు ఉన్నాయి.. ఎవరి పేర ఉన్నాయి అనే వివరాలు నమోదు చేసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరీలు సురేష్‌రావు, శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు.

◆ హోరుగాలితో ఎగిరిన పైకప్పు రేకులు

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్, బాన్సువాడ, జమ్గి(కే), జమ్గి(బీ), గాంధీనగర్, దామర్‌గిద్దా, ముర్కుంజాల్ తదితర గ్రామాల్లో గురువారం రాత్రి జోరు గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. గాలివానతో పరిసర గ్రామాల్లోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పలుచోట్ల చెట్లు రోడ్లకు అడ్డంగా విరిగిపడగా శుక్రవారం ఉదయం తొలగించారు.

◆ నీటి నిల్వ లేకుండా చూడాలి

కొండాపూర్(సంగారెడ్డి): వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మీ అన్నారు. మండల పరిధిలోని గుంతపల్లి, మునిదేవునిపల్లి, మన్‌సాన్‌పల్లి, కోనాపూర్, మాందాపూర్, శివ్వన్నగూడెం గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ పర్యటించారు. ఈ సందర్భంగా వన నర్సరీలు, మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే, మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఏపీఓ వీరప్ప, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.